# అనుమానమే పెనుభూతమై..

- భార్యను చంపి.. ఆత్మహత్యకు పాల్పడిన భర్త
- అనాథలైన ఇద్దరు పిల్లలు..
- నాగోల్ పీఎస్ పరిధిలో ఘటన

మన్సూరాబాద్, అక్టోబర్ 17: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త అమానుషంగా ప్రవర్తించాడు. భార్య గొంతు కోసి చంపడమే కాకుండా.. తాను బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు క్షణికావేశంలో చేసిన పనికి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, ఆమనగల్లు మండలం, ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన తెల్గమల రాజు (42) వివాహం 20 ఏండ్ల కిందట కందుకూరు మండలం, ముచ్చర్ల గ్రామానికి చెందిన సంతోష (38)తో జరిగింది. జీవనోపాధి కోసం నగరానికి వచ్చిన ఈ దంపతులు నాగోల్‌లోని సాయినగర్‌కాలనీ రోడ్డు నం. 2ఏలో ఉంటున్నారు. వీరికి 16 ఏండ్ల కూతురు సింధు, 12 ఏండ్ల కుమారుడు సాయిరాం ఉన్నారు. సింధు ఇంటర్ మొదటి సంవత్సరం, సాయిరాం 9వ తరగతి చదువుతున్నాడు. రాజు లారీని నడుపుతుండగా, సంతోష ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా పని చేస్తుంది. రాజు ఇటీవల మూడు స్కూల్ వ్యాన్లు కొనుగోలు చేసి, నష్టాల్లో కూరుకుపోయాడు. వాటిని అమ్మిన ఆర్థిక ఇబ్బందులు తీరలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతి రోజూ మద్యం తాగి భార్యను హింసించాడు. దీనికితోడు భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని.. తరచూ ఆమెను కొట్టడం మొదలుపెట్టాడు. నెల రోజుల కిందటే సంతోష ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా చేరింది. కొందరితో ఆమె సన్నిహితంగా ఉంటున్నట్లు రాజుకు అనుమానం వచ్చింది. ఆమెను ఎలాగైనా కడతేర్చాలనుకున్నాడు. పిల్లలు పెద్ద వారు కావడంతో.. ఇంట్లో వారు ఉన్న సమయంలో తన ఆటలు సాగవని గ్రహించాడు. సోమవారం సాయంత్రం సాయినగర్‌కాలనీలోని తన ఇంటికి చికెన్ తీసుకువచ్చి భార్యతో వండించాడు. వండిన చికెన్‌ను తీసుకుని పిల్లలు, భార్యతో కలిసి రాత్రి 8 గంటల సమయంలో కర్మాన్‌ఘాట్, తపోవన్‌కాలనీలో ఉండే తన సోదరి మంజుల ఇంటికి వెళ్లాడు. విందు ముగించుకున్న అనంతరం పిల్లలను అక్కడే వదిలి.. రాత్రి 11 గంటలకు భార్య సంతోషతో కలిసి సాయినగర్‌కాలనీకి చేరుకున్నాడు.




హత్యకు గురైన సంతోష, ఆత్మహత్య చేసుకున్న రాజు (ఫైల్)

### పథకం ప్రకారం భార్య హత్య..

సోదరి ఇంటికి వెళ్లిన రాజు మద్యం తాగి.. భోజనం ముగించుకున్న అనంతరం అర్ధరాత్రి సమయంలో భార్యతో కలిసి సాయినగర్‌కాలనీకి చేరుకున్నాడు. పిల్లలు ఇంట్లో లేకపోవడంతో సంతోషను హతమార్చేందుకు సరైన సమయంగా భావించాడు. మద్యం మత్తులో ఉన్న రాజు ఆదమరిచి నిద్రపోయిన భార్యను కిరాతంగా కత్తి పీటతో గొంతు కోసి, రోకలి బండతో తల, ముఖంపై కొట్టి చంపాడు. అనంతరం అక్కడి నుంచి తన బైక్‌పై కర్మాన్‌ఘాట్‌లో ఉంటున్న సోదరి మంజుల ఇంటికి వెళ్లాడు. అప్పటికీ అందరూ నిద్రలో ఉన్నారు. ఇంటి బయటే రాజు కూర్చుండి పోయాడు. మద్యం మత్తు నుంచి బయటపడిన రాజుకు భయం పట్టుకుంది. భార్యను హతమార్చిన తనను ఎవరూ క్షమించరని గ్రహించిన రాజు.. తన సోదరి నివాసముండే బిల్డింగ్ మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

### రాజు ఆత్మహత్యతో వెలుగులోకి..

మంజుల ఇంటి యజమాని మంగళవారం ఉదయం 6 గంటలకు నిద్రలేచి బయటకు వచ్చాడు. ఇంటి ముందు ఓ వ్యక్తి రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉండటాన్ని గమనించాడు. వెంటనే అద్దెకు ఉండే వారిని నిద్రలేపగా.. మృతి చెందిన వ్యక్తి తన సోదరుడిగా మంజుల గుర్తించింది. విషయాన్ని రాజు భార్య సంతోషకు తెలిపేందుకు ఫోన్ చేయగా.. ఆమె ఎంతకీ లిఫ్ట్ చేయలేదు. సాయినగర్‌కాలనీలోనే నివాసముండే రాజు మేన బావ విష్ణుకు మంజుల ఫోన్ చేసి విషయాన్ని చెప్పింది. రాజు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలిపేందుకు సంతోషకు ఫోన్ చేయగా.. ఆమె లిఫ్ట్ చేయడం లేదని.. వెంటనే అక్కడికి వెళ్లి సంతోషను తీసుకుని రావాలని కోరింది. రాజు ఇంటికి తాళం వేసి ఉండటాన్ని విష్ణు గ్రహించాడు. అనుమానంతో డోర్ లాక్‌ను కోసి ఇంట్లోకి వెళ్లి చూడగా.. సంతోష రక్తపు మడుగులో పడి ఉంది. విషయాన్ని తెలుసుకుని అక్కడి చేరుకున్న సంతోష బంధువులు రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను చూసి బోరున విలపించారు.

### అనుమానంతోనే హత్య..

సంతోషపై అనుమానం పెంచుకున్నాడని.. ఆమెను తరచూ కొట్టే వాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. అనుమానంతోనే హత్య చేశాడని ఆరోపించారు. నిత్యం మద్యం తాగే అలవాటు ఉన్న రాజు.. మత్తులోనే భార్యను చంపి తప్పించుకునేందుకు దారి లేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని బంధువులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంతోష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.



రైతులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, డీఎల్పీవో శంకర్‌నాయక్

# క్వారీల వద్ద చర్యలు చేపడుతాం

పెద్దేముల్, అక్టోబర్ 17 : క్వారీల బ్లాస్టింగ్‌ల వల్ల ఆత్కూర్ గ్రామ ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకొంటామని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, తాండూరు డీఎల్పీవో శంకర్ నాయక్‌లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆత్కూర్ గ్రామ శివారులో 3 ఎకరాల 16 గుంటల భూమిని సర్పంచ్ సువర్ణ, గ్రామ ప్రజలతో కలిసి పరిశీలించి రైతులు, గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ఆత్కూర్ గ్రామ శివారులో ఉన్న రాయి నిక్షేపాలను బ్లాస్టింగ్ చేయడానికి కలెక్టర్ అనుమతి కోరుతూ జి.ఈశ్వర్‌రెడ్డి ఎన్‌వోసీ కోసం అప్లై చేశారు. దీంతో అధికారులు మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అందులో భాగంగా బ్లాస్టింగ్ చేసే భూమి ఎక్కడ ఉంది? గ్రామం నుంచి ఎంత దూరంలో ఉంది ? బ్లాస్టింగ్ వల్ల గ్రామస్తులు, రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలను పరిశీలించామన్నారు. రైతులు, గ్రామస్తులు పలు సమస్యలను డీపీవో, డీఎల్పీవోకు విన్నవించారు. అందుకు స్పందించిన డీపీవో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. వారి వెంట ఎంపీడీవో లక్ష్మప్ప, ఇన్‌చార్జి ఎంపీవో రమేశ్‌కుమార్, గ్రామస్తులు, రైతులు ఉన్నారు.

# ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

**డీఎస్పీ నర్సింహులు**

మర్పల్లి, అక్టోబర్ 17 : ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని డీఎస్పీ నర్సింహులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాలులో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలతో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.. నగదు మద్యంపై ప్రత్యేక నిఘా ఉంటుందని, కోడ్ అమలులోకి వచ్చినందున ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువగా నగదు కానీ బంగారం ఇతర వస్తువులు తీసుకెళ్లే వారు ఆధారాలు చూపించాలన్నారు. ఆయా పార్టీల వారు గొడవలు పడకుండా ప్రశాంత వాతావరణంలో ప్రచారాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు..



మర్పల్లిలో వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ నర్సింహులు

**వాహనాల తనిఖీల్లో రూ.15లక్షలు స్వాధీనం**


వికారాబాద్ : ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ స్కూటీలో రూ.15లక్షలు దొరకడంతో పోలీసులు సీజ్ చేశారు. సీఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్నం నరేష్‌కు చెందిన స్కూటీలో రూ.15లక్షలు దొరికాయన్నారు. ఇట్టి డబ్బులపై ఆ వ్యక్తిని విచారించినట్లు పోలీసులు తెలిపారు.

**విస్తృతంగా తనిఖీలు ..**

మొయినాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. మండలంలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని గండిపేట చౌరస్తాలో చెక్‌పోస్టును ఏర్పాటు చేసి మొయినాబాద్ పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. మండల పరిధిలోని జేబీఐఈటీ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా పోలీసులు 411 చీరలను పట్టుకున్నారు. పట్టుకున్న చీరలను పోలీసులు సీజ్ చేశారు.



వికారాబాద్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



మొయినాబాద్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

# ఎన్నికల విధులు బాధ్యతతో నిర్వర్తించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

కొడంగల్, అక్టోబర్ 17: ఎన్నికల్లో అప్పగించబడ్డ విధులను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు నిర్వహిస్తున్న ప్రచారంపై ప్రత్యేక దృష్టిని సారించి, అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. నగదు పట్టుబడితే సాక్షుల సంతకాలతో పాటు, పట్టుబడ్డ నగదుకు సంబంధించిన వ్యక్తి పూర్తి సమాచారంతో పాటు సంతకాలను సేకరించాలని సూచించారు. నగదుకు సంబంధించి రుజువులు చూపించకపోతే సీజ్ చేసి నోడల్ అధికారి అందించాలని పేర్కొన్నారు. అదేవిధంగా సెక్టోరియల్ అధికారు సమావేశంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ విధుల పట్ల అవగాహన కల్పించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తసీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటు సీఐలు రాములు, ఫ్లైయింగ్‌స్క్వాడ్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.




# కట్టెల లారీ పట్టివేత

దోమ, అక్టోబర్ 17 : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లను నరికి కట్టెలను తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి గౌడ్ తెలిపారు. మంగళవారం దోమ మండల పరిధిలోని పాలేపల్లి గ్రామంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చెట్లను నరికి కట్టెలను తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసు సిబ్బందితో ఏఎస్సై చారి అక్కడకు చేరుకొని ఆరా తీయగా అనుమతికి సంబంధించిన పత్రాలను చూపించక పోవడంతో కట్టెల లారీని స్వాధీనం చేసుకొని అట్టి లారీని పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై రవిగౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా చెట్లను నరికి తరలించడాకి ఎవరైనా ప్రయత్నిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**గంజాయి పట్టివేత**

ఆమనగల్లు, అక్టోబర్ 17 : ఆమనగల్లు పట్టణంలోని బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టిన ఆమనగల్లు పోలీసులు ఓ ప్రయాణికుడి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే వివరాలు తెలియాల్సి వుంది. పోలీసులు గంజాయితో పాటు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.




పాలేపల్లిలో కట్టెల లారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు